
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
మంగళవారం 24 జూన్ 2025 పేజీలు 8







# కుదిరిన బిగ్ డీల్?

- విజయకృష్ణ సూపర్ బజార్ దుకాణాలను టెండర్లు లేకుండానే అనధికారికంగా కట్టబెట్టేందుకు భారీ స్కెచ్
- లక్షల్లో బేరసారాలు... కలెక్టర్ ఆదేశాలు భేఖాతరు
- చైర్మన్‌పైనే వెల్లువెత్తుతున్న ఆరోపణలు

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** విజయకృష్ణ సూపర్ బజార్‌లో ఖాళీ అయిన దుకాణాల కేటాయింపుకు బిగ్ డీల్ కుదిరిందా.... ఒకటి రెండు కాదు ఏకంగా తమ ఆధీనంలో ఉన్న పలు దుకాణాలకు టెండర్లు పిలవకుండా కట్టబెట్టేందుకు భారీ స్కెచ్ వేశారనే ప్రచారం జరుగుతుంది. తాజాగా తన అనుయాయులతో బేరసారాలు జరుగుతున్నాయని అందుకే కలెక్టర్ మిగతా 2లో

భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని
## దుర్గగుడి అభివృద్ధి పనులు
2


శ్రీ కనక దుర్గమ్మవారి ఆలయం అభివృద్ధి మాస్టర్ ప్లాన్‌పై జరిగిన సమీక్షలో మంత్రి ఆనం, ఎంపీ కేశినేని



## అభివృద్ధే ధ్యేయం

- త్వరలోనే కృష్ణలంకలో అండర్ పాస్‌లు నిర్మిస్తాం
- రిటైనింగ్ వాల్ కరకట్ట అభివృద్ధితో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు కృషి చేస్తాం
- ఆర్చి రోడ్డు చివర కరకట్ట నుంచి రామలింగేశ్వరరావు నగర్ వరకు వాకింగ్ ట్రాక్ నిర్మించేందుకు ఆలోచన
- కృష్ణలంక ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే గద్దె, కలెక్టర్ లక్ష్మీ శా, ఎంపీ చిన్ని

**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** ఎన్డీయే కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుంది. తూర్పు నియోజకవర్గం కృష్ణలంక ప్రాంతంలోని ప్రజలు జాతీయ రహదారిని దాటేందుకు ప్రజల పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి కృషి చేస్తున్నట్లు మిగతా 2లో...

మన నిత్యజీవితంలో...
## యోగా ఒక భాగం కావాలి

**జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** యోగా మన నిత్యజీవితంలో ఒక భాగం కావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం తెల్లవారుజామునే ఏపీ యోగసభ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీ నగర్‌లో గల ఉదయపు నడక మిత్రమండలి భవనంలో యోగా గురువులు మద్దాల చింతయ్య నేతృత్వంలో నిర్వహించిన యోగా శిక్షణ తరగతుల్లో జిల్లా కలెక్టర్ పాల్గొని సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, 2లో


సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, యోగాసనాలు వేసిన జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ

(మొదటిపేజీ తరువాయి)



## అభివృద్ధే ధ్యేయం

ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. సోమవారం ఉదయం కృష్ణలంకలోని రాణి తోట, సత్యం హోటల్, అమెరికన్ హాస్పటల్ వద్ద జాతీయ రహదారిని దాటేందుకు ప్రజల పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశా లతో ఎంపీ కేశినేని శివనాథ్ పర్యటించారు. ఎన్.హెచ్.ఎ.ఐ, ఇరిగేషన్, వి.ఎం.సి అధికారులతో మాట్లాడి చేపట్టాల్సిన పనుల గురించి చర్చించారు. అలాగే 21వ డివిజన్ ఆర్చి రోడ్డు చివర కరకట్ట వద్ద రిటైనింగ్ వాల్ ను సందర్శించారు. ఆ ప్రాంతం నుంచి రామలింగేశ్వరరావు నగర్ వరకు డెవలప్మెంట్ చేసి వాకింగ్ ట్రాకింగ్ నిర్మించే అంశంపై కలెక్టర్ లక్ష్మీశా తో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చర్చించారు. ముందుగా రాణి తోట నుంచి పశువుల హాస్పటల్ కి వెళ్లే మార్గంలో జాతీయ రహదారి దగ్గర నిర్మించాల్సిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతంలో త్వరగా వెహికల్ అండర్ పాస్ నిర్మించాలని, ప్రమాదాలు నివారించేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, సిగ్నల్ వ్యవస్థ, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ ఎన్.హెచ్.ఎ.ఐ పి.డి. విద్యాసాగర్ కు సూచించారు. అలాగే సత్యం హోటల్ వద్ద యాక్సిడెంట్లు నివారించేందుకు సిగ్నల్ లైట్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాట్ల పై, కృష్ణలంక నుంచి అమెరికన్ హాస్పటల్ నుంచి బందురు రోడ్ వెళ్లేందుకు వెహికల్ అండర్ పాస్ నిర్మించే విషయంపై ఎన్.హెచ్ విజయవాడ అధికారులతో మాట్లాడి త్వరితగతిన చర్యలు చేపట్టాలని కోరారు. అదే విధంగా ఆర్చి రోడ్డు చివర కరకట్ట వద్ద రిటైనింగ్ వాల్ పక్కన చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే గద్దె, కలెక్టర్ లక్ష్మీ శా, ఎన్.హెచ్.ఎ.ఐ, ఇరిగేషన్, వి.ఎం.సి అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించటం జరిగిందన్నారు. జాతీయ రహదారి దాటేందుకు కృష్ణలంక ప్రజల పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. త్వరలోనే రాణిగారితోట, అమెరికన్ హాస్పటల్ ప్రాంతాల్లో వెహికల్ అండర్ పాస్ నిర్మిస్తామన్నారు. అలాగే 21వ డివిజన్ ఆర్చి రోడ్డు చివర కరకట్ట వద్ద రిటైనింగ్ వాల్ నుంచి రామలింగేశ్వరరావు నగర్ వరకు కరకట్టపై వాకింగ్ ట్రాక్ అభివృద్ధి చేస్తామని, ఇందుకు సంబంధించి పరిశీలన చేసేందుకు ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులతో కలిసి ప్రాంతానికి రావటం జరిగిందన్నారు. అమరావతి రాజధానికి ముఖద్వారమైన విజయవాడను అభివృద్ధి చేయటానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ కృష్ణనదీ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని, ఈ ప్రాంతంలో నివసించే వారికి రక్షణ కల్పించాలనే ఉద్దేశ్యంతో 2014లో ముఖ్యమంత్రి గా వున్న చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రూ. 500 కోట్ల రూపాయలతో అంచనాలతో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు మొదలైన సంగతి అందరికీ తెలిసిందే..రక్షణ గోడ నిర్మాణం వల్ల మురుగు నీరు నిల్వ వుంటుంది. ఈ మురుగునీరు నిల్వ వుండకుండా వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రిటైనింగ్ వాల్ కి ఇళ్ల కి మధ్యలో వున్న 70 అడుగుల కరకట్టను సుందరీకరించేందుకు ఇరిగేషన్, వి.ఎం.సి అధికారుల సమన్వయంతో డిపిఆర్ తయారు చేయించునున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.హెచ్.ఎ.ఐ పి.డి విద్యాసాగర్, ఎన్.హెచ్. విజయవాడ ఈ.ఈ సంజీవ్ రాయుడు, ఇరిగేషన్ డిపార్టమెంట్ ఎస్.ఈ. మోహన్‌రావు, ఈ.ఈ రవికిరణ్, డి.ఈ. గోపినాథ్, వి.ఎమ్.సి. సి.సి.పి సంజయ్, అడిషనల్ కమీషనర్ చంద్రశేఖర్, ఎ.సి.పి మోహన్ బాబు, ఈ.ఈ. స్రామాజ్యం, జోనల్ కమీషనర్ షమీ, సి.సి.శ్రీనాథ్ రెడ్డి, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, 17వ డివిజన్ అధ్యక్షుడు రాయి రంగమ్మ, 18వ డివిజన్ ప్రెసిడెంట్ దుర్గారావు, 21వ డివిజన్ ప్రెసిడెంట్ వేమలపల్లి రంగారావు, జనసేన రాష్ట్ర నాయకులు అమ్మిశెట్టి వాసు, బీజేపీ తూర్పు నియోజకవర్గ ఇన్ చార్జ్ కొలపల్లి గణేష్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గుండు శ్రీను, తూర్పునియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు మొకర రమణ, తూర్పునియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు భద్ర, బిసి సెల్ రాష్ట్ర నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు, టిడిపి సీనియర్ మహిళ నాయకురాలు గుడివాడ వరలక్ష్మీ, టిడిపి మహిళా నాయకురాలు ఎస్.కె.సున్నాబీ, అమీనా, టిడిపి నాయకులు దైదా మహేష్, రత్నాలు. బాబు రావు, బిసి సెల్ నాయకుడు,చింతా గోపి, కొడాలి సాయి బాబా,గల్లా శ్రీను,కేశనం భావన్నారాయణ, మైనార్టీ సెల్ నాయకులు హజీబాయ్, జనసేన నాయకులు జయ, కొవ్వూరి కిరణ్ లతోపాటు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయకృష్ణ సూపర్ బజార్ దుకాణాలకు కుదిరిన బిగ్ డీల్ ?





(మొదటిపేజీ తరువాయి)

టెండర్లు పిలిచి కేటాయించాలని ఆదేశించినా గుట్టుచప్పుడు కాకుండా కట్టబెట్టేందుకు లక్షల్లో ఒప్పందాలు కుదుర్చుకున్నారంటూ చైర్మన్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బందర్ రోడ్డులోని దుకాణాలకు గిరాకీ అంతా ఇంతా కాదు. వేలల్లో అద్దెలు కడుతూ లక్షల్లో డిపాజిట్లు ఇస్తుంటారు. అలాంటిది బందర్ రోడ్డులో అది కూడా ఆయుర్వేద హాస్పిటల్ పక్కన నిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలో దుకాణాలంటే ఆషా మాషీ కాదు. ప్రతి ఒక్కరికి ఆ దుకాణాలను దక్కించుకోవాలనే తాపత్రయం. అయితే టెండర్లు అయితే చాలామంది వస్తారు కాబట్టి చైర్మన్ ను ప్రసన్నం చేసుకుంటే మాత్రం టెండర్లు లేకుండానే దక్కించుకోవచ్చనే ఉద్ధేశ్యంతో చైర్మన్ చెంతకు దుకాణాలు పంచాయితీ చేరిందనే ప్రచారం. అందుకే ఎండితో మాట్లాడి ఖాళీగా ఉన్న దుకాణాలకు టెండర్లు లేకుండా కేటాయించాలనే చర్చ జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజయకృష్ణ సూపర్ బజార్ లోని పలు దుకాణాలకు లీజు కాల పరిమితి పూర్తవడంతో టెండర్లు పిలిచి కేటాయించాల్సిన పరిస్థితి. అయితే తమ అనుయాయులకు కేటాయించుకునేందుకు చైర్మన్ టెండర్లు పిలవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొంతమంది



ఇటీవల కలెక్టర్ ను కలిసి టెండర్లు పిలిచేలా ఆదేశాలివ్వాలని కోరడంతో స్పందించిన కలెక్టర్ నేరుగా ఎండి కి టెండర్లు పిలిచి కేటాయించాలని సూచించినట్లు సమాచారం. తాజాగా కొంతమంది చైర్మన్ ను కలిసి టెండర్లు ఎప్పుడు పిలుస్తున్నారని అడిగినా సమయం ఉందంటూ దాట వేస్తుండడంతో మరిన్ని అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. చూడాలి సూపర్ బజార్ పరిధిలోని దుకాణాలకు టెండర్లు పిలుస్తారా లేక కుదుర్చుకున్న డీల్ ప్రకారం టెండర్లు లేకుండానే కట్టబెడతారా అనేది....

# మన నిత్యజీవితంలో యోగా ఒక భాగం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

యోగాసనాలు వేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత మే నెల 21 ఒకటవ తేదీ నుండి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్రా కార్యక్రమం ఈనెల 21వ తేదీ అంతర్జా తీయ యోగా దినోత్సవంతో ముగిసింది. ఈ యోగా కార్యక్రమం అధికారి కంగా ముగిసినప్పటికీ యోగా సాధన కార్యక్రమం మన నిత్యజీవితంలో ఒక భాగం చేసుకుని నిరంతరం కొనసాగించాలని జిల్లా కలెక్టర్ పలుమార్లు చెబుతూ వచ్చారు.ఇందులో భాగంగానే జిల్లా కలెక్టర్ సోమవారం కూడా పట్టువదలక యోగ సాధన చేసి అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

మచిలీపట్నం నగరంలో ఏపీ యోగాసభ ఆధ్వర్యంలో గాంధీనగర్ లోనే కాకుండా చింతగుంటపాలెం, కాస్మోపాలిటన్ క్లబ్, గొడుగుపేట, శంకరమఠంలో కూడా ఉచితంగా యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు ఎక్కడా లేనివిధంగా నగరంలో ఇటువంటి మంచి అవకాశం నగర ప్రజలకు దక్కింది. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. జిల్లా కలెక్టర్ ను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు అనారోగ్యం బారిన పడకుండా ప్రతిరోజు ఉదయం ఒక గంట పాటు సమయం కేటాయించి యోగ సాధన చేసి ఆరోగ్యవంతులై ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ దిశగా ముందడుగు వేయాల్సి ఉంది.

# భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని దుర్గ గుడి అభివృద్ధి పనులు



**ఇంద్రకీలాద్రి, మేజర్ న్యూస్ :** శ్రీ కనక దుర్గమ్మవారి ఆలయానికి విచ్చేసే భక్తులకు కావాల్సిన మౌళిక సదుపాయాలు, వసతులు కల్పించేందుకు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్ తయారు చేయనున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ కేశినేని శివనాథ్ శివనాథ్ తెలిపారు. అమ్మవారి ఆలయం లో పెండింగ్ ఉన్న మాస్టర్ ప్లాన్ పై, కేంద్ర ప్రభుత్వ ప్రసాదం స్కీమ్ పనుల పురోగతిపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ తో పాటు జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వినయ్ చంద్, దేవాదాయ శాఖ కమిషనర్ కే రామచంద్ర మోహన్, దుర్గా ఆలయం ఈవో వీకే సీనా నాయక్ పాల్గొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఈవో శీనా నాయక్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఆలయ మాస్టర్ ప్లాన్ వివరించారు. సమీక్షా సమావేశం ముగిసిన తర్వాత మాస్టర్ ప్లాన్ అమలుకు చర్యలు తీసుకుంటున్న క్రమంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) ఆలయ అధికారులతో కలిసి సోమవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం మీడియా సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ దుర్గమ్మ ఆలయాన్ని ఆధ్యాత్మికతతో పాటు ఆధునికతను అనుసంధానం చేసి దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నామని అన్నారు. అన్ని విభాగాలను అనుసంధానం చేసి సమన్వయంతో దుర్గమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఇంద్ర కీలాద్రి అభివృద్ధి కి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు చరిత్ర లో నిలిచి పోతాయన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని 50 సంవత్సరాల వరకు భక్తుల అవసరాలకు ఉపయోగ పడే విధంగా ఆలయ అభివృద్ధి పనులు చేయబోతున్నట్లు తెలిపారు. ఇందుకోసం దేవదాయ శాఖ, ఆలయ ఇంజనీరింగ్ శాఖ తయారు చేసిన మాస్టర్ ప్లాన్ చూడటం జరిగిందన్నారు. ఈ నెల 28వ తేదీ నిర్వహించబోయే సమీక్షా సమావేశంలో మాస్టర్ ప్లాన్ అమలు పై సమగ్రంగా ముందుకు వెళతామన్నారు. భక్తుల సౌకర్యమే ప్రధాన కర్తవ్యం గా మాస్టర్ ప్లాన్ కృషి చేస్తున్నట్లు తెలిపారు.. ప్రసాద్ పథకం అమలు కోసం కేంద్రంలో ఉన్నత స్థాయిలో సంప్రదింపులు జరుపుతున్నానని, త్వరలో శుభ వార్త వింటామన్నారు..దుర్గమ్మ గుడి పరిసరాలలో ఆధ్యాత్మికతను పెంపొందించి పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా అనుకూల కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాబోయే యాబై ఏళ్ల అవసరాలకు తగ్గట్లు శాశ్వత ప్రాతిపదికన పలు అభివృద్ధి పనులను చేపట్టేందుకు బృహత్తర ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లో భాగంగా దుర్గమ్మ ఆలయం లో భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలను కల్పించడానికి కుమ్మరిపాలెం సెంటర్ నుంచి ఆలయానికి అనుసంధానంగా ఘాట్ రోడ్డు ఏర్పాటు,క్యూ లైన్ల ఆధునీకరణ,వాహనాల పార్కింగ్, ప్రసాదాల పోటు, అన్నప్రసాద కేంద్రం, కేశఖండనశాల, వెయిటింగ్ హాల్, రెస్ట్ రూమ్స్, ఎస్కలేటర్లు, లిఫ్టుతదితర అభివృద్ధి పనులను శాశ్వతంగా నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. దుర్గమ్మ గుడి అభివృద్ధికి సంబంధించిన డిపిఆర్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు పరిశీలించి ఆలయ అభివృద్ధిపై సలహాలు సూచనలను అందజేస్తున్నారని వెల్లడించారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి నేతృత్వంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ ఆఫ్ విజయవాడ వారిచే బృహత్తర ప్రణాళిక రూపొందిస్తున్నారని అన్నారు. ఈ నెల 28వ తేదీన ఎమ్మెల్యే సుజనా చౌదరి సమక్షంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి సమగ్రమైన ప్రణాళికను సిద్ధం చేస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కోటేశ్వరరావు, రాంబాబు, సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ బీ పాండురంగారావు, రిటైర్డ్ ఇంజనీర్ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# 28న తెనాలిలో జరుగునున్న మానవ హక్కుల పరిరక్షణ సదస్సును జయప్రదం చేయండి



విజయవాడ మేజర్ న్యూస్ : తెనాలి పోలీసులు దళిత, మైనార్టీ యువకులపై చేసిన అరాచకత్వాన్ని, మానవ హక్కుల ఉల్లంఘనను నిరసిస్తూ తెనాలి పట్టణంలో జూన్ 28న సాయంత్రం నాలుగు గంటలకు జరిగే మానవ హక్కుల పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వర్ రావు మాదిగ అన్నారు. విజయవాడ గాంధీనగర్ లోని ఏపీ ఎంఆర్పిఎస్ రాష్ట్ర కార్యాలయంలో, మాల మహానాడు అధ్యక్షులు తుమ్మల ఫ్రాన్సిస్, కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్రా మాల్యాద్రి, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్, రెల్లి సంఘం అధ్యక్షులు ఎర్రంశెట్టి ప్రసాద్ తదితర నాయకులతో కలిసి ఆయన ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వర్ రావు మాదిగ, తదితర నాయకులు మాట్లాడుతూ తెనాలి పోలీసులు దళిత మైనారిటీ యువకులపై అక్రమ కేసులు పెట్టి పోలీస్ స్టేషన్లో, బహిరంగ ప్రదేశాల్లో అరికాళ్ళపై లాఠీలు విరిగేటట్లుగా అమానుషంగా దాడి చేసిన సంఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో జ్యుడీషియల్ విచారణ జరిపించాలన్నారు. చట్టఉల్లంఘనకు పాల్పడిన తెనాలి టూ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ రాముల నాయక్, తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ రమేష్ బాబులతో పాటు ఈ అరాచకం లో పాల్గొన్న కానిస్టేబుల్ పై తక్షణమే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని అన్నారు. తెనాలి పోలీసులు దళిత యువకులపై నడిరోడ్డుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని సమర్థించి వారికి వత్తాసు పలికిన గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రజాప్రతినిధులు రాష్ట్ర మంత్రులు ముఖ్యంగా హోం మంత్రి పోలీస్ చట్ట వ్యతిరేక చర్యలను బలపరుస్తూ చేస్తున్న వ్యాఖ్యలపై ఉన్నత న్యాయస్థానాలు జాతీయ మానవ హక్కుల సంఘం స్పందించి తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. జూన్ 28న తెనాలి పట్టణంలో జరిగే మానవ హక్కుల పరిరక్షణ సదస్సుకు ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి,దళిత బహుజన ఫ్రంట్, ప్రజాస్వామిక వాదులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

# ఘనంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలి ధాన్ దినోత్సవం







నాగాయలంక: మేజర్ న్యూస్ : మండలంలో సోమవారం శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్ సందర్భంగా నాగాయలంక పర్రచివర, వివిధ గ్రామాలలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్ సందర్భంగా ఆయన దేశానికి చేసినటువంటి సేవలను త్యాగాలను స్మరించుకుంటూ వారి చిత్రపటానికి పుష్పాలంకరణ చేయుచు వారు చేసిన త్యాగాలను కొనియాడినారు. ఈ కార్యక్రమము కృష్ణాజిల్లా బీజేపీ నేతలు జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగల మురళి దొండపాటి శ్రీను రాష్ట్ర కోర్ కమిటీ సభ్యురాలు బోగాది రమాదేవి సీనియర్ నాయకులు చెన్నగిరి లతా మోహన్ బండ్రెడ్డి బోసు తలశిల రాం బాబు నాగాయలంక మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు గుడివాడ శివాజీ గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినారు.

## వ్యవసాయ డిప్లొమోలకు దరఖాస్తులు 30 వరకు అవకాశం

### ఘంటసాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సత్యప్రియ లలిత



ఘంటసాల, మేజర్ న్యూస్: అగ్రికల్చర్ డిప్లొమో కోర్సులకు దరఖాస్తులు ఈనెల 30 వరకు అవకాశం కల్పిస్తున్నట్లు ఘంటసాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సత్య ప్రియలలిత సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ పదవ తరగతి, తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు, ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థులు, మధ్యలో ఆపేసిన వారు 2025-26 విద్యా సంవత్సరానికి వ్యవసాయ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశం కొరకు దరఖాస్తు 30 వరకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గుంటూరు లాం వారు కల్పిస్తున్న అవకాశాన్ని అర్హులైన ఆసక్తి కలగిన అభ్యర్థులు ఈ నెల 30 తేదీ లోపు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకోవడానికి https://angrau.ac.in www.angrau.ac.in సందర్శించాలని, మరిన్ని వివరాల కొరకు 08671 254499 నెంబర్ను సంప్రదించాలని డాక్టర్ సత్య ప్రియలలిత తెలిపారు.

## శ్యామ ప్రసాద్ ముఖర్జీ 69వ వర్ధంతి



నందిగామ, జూన్ 23, మేజర్ న్యూస్: పట్టణ లోని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నాడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ 69వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన భారతదేశం అంతా ఒక్కటే అనే నినాదంతో ఆనాడు కాంగ్రెస్ మంత్రివర్గంలో పనిచేస్తూ కాంగ్రెస్ చేసేటువంటి పనులు నచ్చక కాశ్మీరు విడగొట్టడం కోసం నెహ్రూ ప్రయత్నం చేసినప్పుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ మంత్రి పదవికి రాజీనామా చేసి భారతదేశాన్ని విడగొట్టడం నేను ఒప్పుకోను ఒక దేశంలో రెండు మతాల విశ్లేషణ ఉండకూడదు అని పట్టు పట్టిన మహనీయుడు జన సంఘ్ వ్యవస్థాపకుడు. ఆయనకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ సభ్యులు కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.

## మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా



కోడూరు మేజర్ న్యూస్: కోడూరు మండలం హంసలదీవి గ్రామాలలో మంచినీటిని సరఫరా చేస్తున్న మన శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ సోమవారం తీర గ్రామాల దాహం తీర్చేందుకు ఇరవై వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్ ద్వారా కోడూరు మండలం హంసలదీవి గ్రామాలకు తాగునీరు అందచేశారు.

## వివాహ వేడుకలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కైలే



పామర్రు జూన్ 23 మేజర్ న్యూస్: మండల పరిధిలోని పసుమర్రు గ్రామంలో సోమవారం జరిగిన జుజ్జువరపు చిన్ని కుమారుని వివాహ వేడుకలలో పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పామర్రు ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, ఎంపీటీసీ సభ్యుడు తాడిశెట్టి శ్రీనివాసరావు తదితరులతో కలసి అనిల్ కుమార్ నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## బీసీ నేతకు మాతృవియోగం



చల్లపల్లి, మేజర్ న్యూస్ : చల్లపల్లి మండలం పాగోలు గ్రామ బీసీ నేత పెనుమూడి శ్రీనివాసరావు మాతృమూర్తి వెంకటేశ్వరమ్మ (75) అనారోగ్యంతో సోమవారం ఉదయం కన్నుమూశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు, యువనేత మండలి వెంకట్రామ్,ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్బాబు, సర్పంచ్ తోట శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, టీడీపీ నేతలు మేకా వెంకటేశ్వరరావు, వేమూరి రమేష్బాబు, మల్లంపల్లి శివరామకృష్ణ తదితరులు వెంకటేశ్వరమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు.

## బుచ్చయ్య చౌదరి వ్యక్తిగత దూషణలు మానుకోవాలి



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి చేసిన అసత్య, అసభ్య కరమైన వ్యాఖ్యలను వైసీపీ అభిమాని యువనేత బడే గౌతమ్ సోమవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రజాభిప్రాయాన్ని గౌరవించాల్సిన స్థాయిలో ఉన్న వ్యక్తి నుంచి ఇలాంటి వ్యక్తిగత దూషణలు చేయడం ఆందోళనకరమన్నారు. ఒక మాజీ ముఖ్యమంత్రిని మానసిక స్థితి లేని వ్యక్తిగా చాటిచెప్పడం, జగన్ తలకాయ నరకొమ్మ అంటూ అనటం, అసలు జీవించే హక్కే లేదనటం, ఆయనపై అసత్య ఆరోపణలు చేయడం అనాగరికతకు నిదర్శనమన్నారు గౌతమ్. వైఎస్ జగన్ తన పాలనలో రైతులకు, మహిళలకు, విద్యార్థులకు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఎంతో మేలు చేశారని, గ్రామ స్థాయిలో పాలనను తీసుకెళ్లిన ప్రజా నాయకుడు జగనని, అటువంటి నాయకుడిపై విమర్శించాలంటే విధానాలను విమర్శించాలి వ్యక్తిని కాదని, తెలంగాణాలో మారిన పరిస్థితులు టీడీపీ నేతలకు ఉత్సాహాన్నిస్తే దాన్ని ప్రజాస్వామ్యవ్యతిరేకంగా వాడుకోవడం తగదని ప్రజలే నిజమైన తీర్పును త్వరలో ఇస్తారని, టీడీపీ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి అసభ్యకరమైన వ్యాఖ్యలతో రాజకీయ ప్రాముఖ్యత పొందాలని చూడడం విచారకరమని, గోరంట్ల బుచ్చయ్య చౌదరి చేసిన వ్యాఖ్యలను గౌతమ్ తీవ్రంగా ఖండించారు.

## ఘనంగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలి ధాన్ దినోత్సవం



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : జనసంఘ వ్యవస్థాపకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దినోత్సవం (వర్ధంతి) కార్యక్రమాన్నిబీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. సోమవారం స్థానిక వంతెన సెంటర్లో శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించి ఆయన సేవలను ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ జీ.వి నగరాయులు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బోగాది చంద్రశేఖర్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ తుంగల వెంకటగిరి, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు భూపతి సుబ్రమణ్యం, దళిత యువ నాయకులు మేరుగ రణధీర్, కోడూరు మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు తోట శ్రీనివాస్, బీజేపీ నేతలు చిట్టా ప్రసాద్



కన్నా నానీలు పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో కృష్ణాజిల్లా బీజేపీ పార్టీ ప్రధాన కార్యదర్శి తుంగల మురళి, మండల పార్టీ అధ్యక్షులు సోబిలెఏడుకొండలు, మునగాల బాలకృష్ణ, చన్నగిరి ఆంజనేయులు తదితర గ్రామ పెద్దలు కార్యకర్తలు శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జీవి నగరాయులు ఆధ్వర్యంలో వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు.

## యువత పోరులో పెద్ద సంఖ్యలో పాల్గొన్న పామర్రు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు




పామర్రు జూన్ 23 మేజర్ న్యూస్ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు స్థానిక మాజీ శాసనసభ్యులు రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ ఆదేశాలతో పామర్రు నియోజకవర్గం నుండి మచిలీపట్నంలో నిర్వహించిన యువత పోరు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మచిలీపట్నం ధర్నా చౌక్ లో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన జిల్లా వాలంటరీ విభాగ అధ్యక్షులు పోలిమెట్ల వంశీకృష్ణ, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు తాడిశెట్టి శ్రీనివాసరావు, పామర్రు ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, పమిడిముక్కల మండల వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, పామర్రు మండల వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, అరుమాళ్ళ రమాదేవి, పమిడిముక్కల మండల ప్రధాన కార్యదర్శులు గొర్రిపూడి బుజ్జి, కనుమూరి వెంకటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు బొల్లా సాంబశివరావు, జిల్లా పార్టీ కార్యదర్శి తిరుమల శెట్టి బోసు బాబు, పామర్రు మండల ప్రధాన కార్యదర్శులు పెయ్యల రాజు, కొడాలి సురేష్, మున్నంగి ఫణి రెడ్డి, బండ్రపల్లి నాగరాజు,కాకి ప్రవీణ్, సతీష్,మొవ్వ రంగారావు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 66 ఫిర్యాదులు



విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ : సోమవారం పోలీస్ కమి షనర్ వారి కార్యాలయంలో ఎన్.టీ.ఆర్.జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజ శేఖర బాబు ఆదేశాలు మేరకు డి.సి.పి. ఏ.బి.టి.ఎస్.ఉదయారాణి, "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"( పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం) కార్యక్ర మాన్ని నిర్వహించి బాధితులు నుండి వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 66 ఫిర్యాదులపై బాధితులతో మాట్లాడటంతో పాటుగా, దివ్యాంగులు, వృద్దుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లతో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడమైనది. అందిన ఫిర్యాదుల్లో భూవివాదాలకు, ఆస్తి వివాదాలకు, నగదు లావాదేవీలకు సంబంధించినవి 37, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు సంబంధించినవి 08, దొంగతనాలకు సంబంధించి నవి 03, కొట్లాటకు సంబంధించినవి 08, మహిళా సంబంధిత నేరాలకు సంబంధించి 01, ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలకు, సంఘటనలకు సంబంధించినవి 09, మొత్తం 66 ఫిర్యాదులును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డి.సి.పి. ఏ.బి.టి.ఎస్.ఉదయారాణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని ఫిర్యాదులు పరిష్కరించుటలో సహకారాన్ని అందించారు.

## మంచినీటి సమస్య పరిష్కరించాలని కలక్టరుకు వినతి

### ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆదర్శ సింగలూరు గ్రామస్తులు



**గుడ్లవల్లేరు జూన్ 23 మేజర్ న్యూస్ :** మంచినీటి చెరువుకు నీరుపెట్టేందుకు అవకాశంలేక, మంచినీరు అందక యిబ్బందిపడుతున్నాం మంచినీటి సౌకర్యం కల్పించండంటూ సోమవారం సర్పంచ్, సింగలూరు గ్రామస్తులు అందరూ మచిలీపట్నం తరలివెళ్లి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలక్టరు తరపున డిఆర్వో చంద్రశేఖరావుకు వినతిపత్రం సమర్పించారు. మంచినీటి చెరువుకు పడమర పంట కాలువ నుండి ప్రైవేటు భూమిలోని పంట బోదె ద్వారా 70 ఏళ్ళ నుండి నింపబడే మంచినీటి చెరువు నీటికి ప్రస్తుత రైతు అభ్యంతరం వ్యక్తం చేయడంతో గ్రామానికి మంచినీటి సమస్య ఉత్పన్నమైందన్నారు. దీంతో మే 19న గ్రామ మంచినీటి సమస్యపై, రైతు అభ్యంతరాలపై గుడ్లవల్లేరు మండల రెవెన్యూ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు విన్నవించుకున్నా పరిష్కారం లభించలేదన్న ఆవేదన వ్యక్తం చేసారు. అనంతరం గ్రామస్తులందరు దాతల సహకారంతో మంచి నీటి చెరువు గట్టుపై 250 అడుగుల లోతు బోరు వేసినా మంచినీరు పడక పోవడంతో చేసేదేమీలేక గ్రామస్తులందరం సింగలూరు గ్రామానికి మంచి నీటి సౌకర్యం కల్పించండని, పి4 కార్యక్రమంలో మంచినీటి సమస్య పరిష్క రించదలిస్తే గ్రామస్తుల భాగస్వామ్యం కూడా ఉంటుందని జిల్లా కలక్టరుకు వినతి పత్రం సమర్పించామని తెలిపారు. కార్యక్రమంలో చంద్రాల సర్పంచ్ కలిశెట్టి అర్జునరావు, సంఘసేవకుడు డాక్టర్ బందారు శ్యామ్ కుమార్, గ్రామస్తులు ఉద్దంతి శివనాగ మల్లేశ్వరావు, మాచర్ల రమణయ్య, కోట పైడేశ్వ రావు, ఆకురాతి హనుమంతరావు, తుమ్మలచర్ల లక్ష్మణరావు, ఎ.జనార్ధన రావు, కెపి బుచ్చయ్య, బి.అర్జునరావు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కైలే



**పామర్రు జూన్ 23 మేజర్ న్యూస్:** పామర్రు టౌన్‌లో మద్దుల సుబ్రహ్మణ్యం కుమార్తె వివాహం ఇటీవల జరుగగా నూతన దంపతులను పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ సోమవారం ఆశీర్వదించారు. పలువురు పార్టీ నాయకులతో కలిసి ఆయన సుబ్రమణ్యం స్వగృహానికి వెళ్లి అక్కడ ఉన్న నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ తో పాటు ఎంపిపి దాసరి అశోక్ కుమార్, ఎంపిటిసి సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, లక్ష్మి, ఆ పార్టీ నాయకులు కొడమంచిలి మహేష్, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారంలో నాణ్యతకు ప్రాధాన్యమివ్వండి





### అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలకు పరిష్కారం చూపండి..

### అర్జీల పరిష్కారంలో అలసత్వాన్ని సహించను..

### ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జూన్ 23, మేజర్ న్యూస్ :** అర్జీల పరిష్కారంలో నాణ్యతకు, సంతృప్తి స్థాయికి ప్రాధాన్యమివ్వాలని, అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోనని పునరావృతం కాకుండా అర్జీలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కార మార్గం లభిస్తుందని ఎంతో ఆశతో గ్రీవెన్స్ సెల్‌ను ఆశ్రయిస్తున్నారన్నారు. వారి నమ్మకానికి మరింత బలం చేకూర్చే విధంగా నాణ్యతా ప్రమాణాలతో పునరావృతం కాకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్దేశించిన సమయానికి సమస్యలకు పరిష్కారం చూపాల్సిందేనని ఈ విషయంలో ఏ మాత్రం అలసత్వం వహించినా సహించబోనని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. మానవతా దృక్ప థంతో సానుకూలతతో సమస్యలను పరిష్కరించడంపై దృష్టిపెట్టాలన్నారు. స్వీకరించిన అర్జీలకు సంబంధించి కిందిస్థాయి అధికారులు సిబ్బంది నుండి స్పష్టమైన సమాచారం తీసుకుని సమస్యలను పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరచడమే లక్ష్యంగా అధికారులు పనిచేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. ఇకపై అర్జీల పరిష్కారంపై తాను ప్రతి రోజు సమీక్ష నిర్వహిస్తానని అర్జీల పరిష్కారంలో సరైన కారణం లేకుండా జాప్యం జరిగినా, నాణ్యత లేకున్నా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

**189 అర్జీల స్వీకరణ:** రెవెన్యూ శాఖకు సంబంధించి 93, పోలీస్ శాఖకు 22, విద్య 12, ఎంఏయూడీ 10, అటవీ 5, పంచాయతీరాజ్ 5, సర్వే 5, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 4, ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ 3, హౌసింగ్ 3, గ్రామీణ నీటి సరఫరా 3, వ్యవసాయం 2, సహకార శాఖ 2, విభిన్న ప్రతిభావంతులు 2, డీఆర్‌డీఏ పీడీ 2, ఉపాధి హామీ 2, హెల్త్ 2, విద్యుత్, పౌరసరఫరాలు, కళాశాల విద్య, డ్వామా, మత్స్య, జలవనరులు, కేడీసీసీ సీఈవో, కార్మిక శాఖ, బ్యాంకు, గనులు, ఆర్ అండ్ బీ, సాంకేతిక విద్యకు సంబంధించిన ఒక్కో అర్జీతో కలిపి మొత్తం 189 అర్జీలను స్వీకరించడం జరిగిందని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అర్జీల స్వీకరణలో గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మహేశ్వరరావు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మీకోసంలో స్వయంగా ఫిర్యాదులు స్వీకరించిన కృష్ణాజిల్లా ఎస్పీ





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** చట్ట పరిధిలో మీ సమస్యల పరిష్కారానికి కృష్ణాజిల్లా పోలీస్ శాఖ ఎల్లవేళలా సిద్ధంగా ఉంది.సామాన్య ప్రజలు నిత్యజీవితంలో వారు ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం తక్షణమే గుర్తుకు వచ్చేది పోలీస్ శాఖనే. అలా సమస్యతో వచ్చిన ఫిర్యాదు దారుల సమస్యల పట్ల జాప్యం వహించకుండా, చట్ట పరిధిలో విచారణ జరిపి పరిష్కారం అందించేలా కృషి చేయాలని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు అన్నారు.

ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వి.వి.నాయుడు ఫిర్యాదులు స్వీకరించి సంబం ధిత అధికారులకు బదిలీ చేశారు. జిల్లా నలుమూలల నుండి వివిధ రకాల సమస్యలతో ప్రజలు ఫిర్యాదు చేయడానికి రాగా, వారందరి సమస్యలను ఎస్పీ ప్రత్యక్షంగా తెలుసుకొని, వారితో ముఖాముఖి మాట్లాడి మీ సమస్యను గుర్తి చింతించవద్దని మీ సమస్య పరిష్కారానికి కృష్ణాజిల్లా పోలీస్ శాఖ ఉందని వారిలో భరోసా నింపి, ఆ ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు బదిలీ చేసి వాటిపై పరిష్కారం అందించేలా ఆదేశాలు జారీ చేయడం జరిగింది.వారికున్న సమస్య గురించి ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారిలో నడవలేని స్థితిలో ఉన్నవారికి సిబ్బంది వారికి చేయినందించి వారు స్వేచ్ఛగా ఫిర్యాదు చేసేలా చూశారు. వారి సమస్యల ఆధారంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తక్షణమే సంబంధిత పోలీస్ అధికారులకు ఆన్లైన్ ద్వారా బదిలీ చేసి రిసిప్టును ఫిర్యాదుదారులకు అందజేయడం జరిగింది.

# ప్రతి ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన 16 ఫిర్యాదులు






**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించడం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతో పాటు, వాటికి శాశ్వత పరిష్కారం కనుగొనడంపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ప్రజలు తీసుకువచ్చిన ఫిర్యాదులను, శాఖధిపతులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారులకు తమ స్వయంగా వచ్చి పరిశీలించి శాశ్వతమైన పరిష్కారాన్ని తీసుకొచ్చే విధంగా చూస్తామని తెలియపరిచారు. ఈ సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 16 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 2, ఇంజనీరింగ్ 8, రెవెన్యూ సంబంధించినవి 3, వైద్య, ఆరోగ్యం 1, హార్టికల్చర్ 1, ఎస్టేట్ 1 మొత్తం కలిపి 16 ఫిర్యాదులను అందుకున్నారు అధికారులు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్లు పి. సత్యకుమారి,పి సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మీకోసం అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రజల నుండి అందుతున్న మీకోసం అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి కే చంద్రశేఖర రావు జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిఆర్ఓ, కె ఆర్ ఆర్ సి. ఎస్.డి.సి శ్రీదేవి అదనపు ఎస్పీ సత్యనారాయణ, మచిలీపట్నం ఆర్ డి ఓ కే స్వాతిలతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఆ ప్రకారం కలెక్టరేట్లో మొత్తం 146 అర్జీలు అందాయి. ముందు డిఆర్ఓ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో కోర్టు ధిక్కరణ కేసులు జలవనరుల శాఖ పరిధిలో 6, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో 17 పెండింగ్ లో ఉన్నాయని వాటికి సంబంధించి వకావత్ లు వెంటనే దాఖలు చేయాలన్నారు. ఐ గాట్ కర్మ యోగి ఆన్లైన్ శిక్షణ తరగతులు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు వెంటనే పూర్తి చేయాలన్నారు.

కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మీకోసం అర్జీల పట్ల అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచిస్తోందన్నారు. గడువు దాటిన అర్జీలు 60 ఉన్నాయని వాటిని సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలన్నారు. మరలా తెరవబడిన అర్జీలు మొత్తం 204 ఉన్నాయని వాటిలో ప్రధానంగా సర్వే భూ రికార్డులు శాఖలో 116, రెవెన్యూ శాఖలో 54, పంచాయతీరాజ్ శాఖలో 22 అత్యధికంగా పెండింగ్లో ఉన్నాయన్నారు. మరలా తెరువబడిన 38 అర్జీలను సంబంధిత అధికారులు ఇప్పటివరకు అసలు చూడనేలేదని ఇది సరైనది కాదని స్పష్టం చేస్తూ ఇకనైనా పరిశీలించి తగిన విధంగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి పంచాయతీరాజ్ విభాగానికి సంబంధించి ఒక అర్జీ ఒక నెల గడువు దాటిన ఇంకా పరిష్కారం కాలేదని వెంటనే దానిపై దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. పోలీసు, పంచాయతి రాజ్, సర్వే భూ రికార్డుల సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయనీ తీసుకున్న చర్యల వివరిస్తూ ఎండార్స్మెంటులు సంబంధిత అర్జీదారులకు వెళ్లడం లేదని ఇకనైనా తప్పనిసరిగా అర్జీదారునికి సమాధానం నేరుగా గాని, రిజిస్టర్ పోస్టులో గానీ, వాట్సాప్ ద్వారా గాని పంపాలన్నారు. సమాధానాలు సరిగా అర్జీదారులకు పంపారా లేదో సంబంధిత ఉన్నత అధికారులు మాత్రమే ఆడిట్ చేయాలన్నారు. ఈ సందర్భంగా పెడనకు చెందిన ఎర్ర సుబ్రహ్మణ్యేశ్వర రావు గత 4 సంవత్సరాలుగా ప్లాస్టిక్ నిషేధయి పర్యావరణ పరిరక్షణ పేరుతో చేపట్టిన ఉద్యమంలో భాగంగా పెడన కలంకారి గుడ్డ సంచులను డీఆర్ఓ కె.ఆర్.సి.డి.సి అదనపు ఎస్పీ ఆర్డీవో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో కే. కన్నమ నాయుడు, పంచాయతీరాజ్ ఎస్ ఈ రమణ రావు రహదారులు భవనాలు ఆర్డబ్ల్యూఎస్ ఈఈ లు లోకేష్, నటరాజు డీఎం హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ట, జిల్లా వ్యవసాయ అధికారి మనోహర్ రావు, మార్కెటింగ్ ఏడి నిత్యానందము, ఉద్యాన అధికారి జే జ్యోతి, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకటరావు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ సత్యసాయి బాబా జన్మదిన వేడుకలు





**నందిగామ, జూన్ 23, మేజర్ న్యూస్:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయములో మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి దంపతులు, భగవాన్ శ్రీ సత్య సాయి సేవా సమితి కమిటీ సభ్యులు, భక్తులతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో మండవ కృష్ణకుమారి దంపతులు శ్రీ సత్య సాయి ప్రేమ ప్రవాహిని రథయాత్రకు కొబ్బరికాయలు కొట్టి స్వామివారి పాదాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా మాట్లాడు తూ భగవాన్ శ్రీసత్యసాయి బాబావారి 100వ జన్మదినోత్సవ వేడుకలలో భా గంగా శ్రీ సత్యసాయి బాబావారి మానవసేవే మాధవసేవ, జనసేవే జనా ర్ధాడిని సేవ, లోక సేవ లోకేశ్వరుడు కి సేవ ఈ సేవ దివ్య సందేశాన్ని ప్రజ లందరికీ, అందించాలనే సత్సంకల్పంతో శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని పేరు తో 5 దివ్యరథాలు భారతదేశ యాత్రకు బయలుదేరినాయని తెలియజేశారు. అందులో భాగంగా ప్రేమ ప్రవాహిని దివ్య రథానికి ఈరోజు పూజా కార్యక్రమాలు నిర్వహించడం నిజంగా చాలా సంతోషాన్ని కలిగించిందని ఆ భగవాన్ సత్యసాయి స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు. అనంతరం స్వామివారి రథయాత్రతో పాటు శివాలయం వరకు సత్య సాయి బాబా వారి నామస్మరణతో కోలాటాలు చేస్తూ ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఉప్పుటూరి వాసుదేవరావు, సీనియర్ టిడిపి నాయకులు మండవ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఏర్పేడు చేరుకున్న యార్లగడ్డ అభిమానుల పాదయాత్ర

**గన్నవరం, జూన్ 23, మేజర్ న్యూస్ :** గోవిందుని మొక్కులు చెల్లించుకునేందుకు యార్లగడ్డ అభిమానులు చేపట్టిన తిరుమల పాదయాత్ర సోమవారం మధ్యాహ్నానికి రేణిగుంట సమీపంలోని ఏర్పేడుకు చేరుకుంది. గన్నవరం నియోజకవర్గం నుంచి యార్లగడ్డ వెంకట్రావు ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే కాలినడకన తిరుపతి వచ్చి మొక్కులు చెల్లించుకుంటామని యార్లగడ్డ అభిమానులు ఎన్నికల ముందు శ్రీవారికి మొక్కుకున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం వెంకట్రావు 37 వేల ఓట్ల పైచిలుకు భారీ మెజార్టీతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో వెంకట్రావ్ అభిమానులు శ్రీవారికి ముడుపులు చెల్లించుకునేందుకు గత



ఏడాదికాలంగా ప్రయత్నిస్తూ ఉన్నా ఏదొక అవాంతరం ఎదురవటంతో వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ఈనెల తొమ్మిదో తేదీ నూతక్కి సునీల్ ఆధ్వర్యంలో ఏడుగురు సభ్యుల బృందం విజయవాడ బెంజ్ సర్కిల్ వద్ద గల వినాయకుడి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం పాదయాత్ర గా తిరుమలకు బయలుదేరారు. గత 15 రోజుల్లో రోజుకు సగటున 26 కిలోమీటర్లు చొప్పున నడుస్తూ 400 కిలోమీటర్లు పూర్తి చేసుకుని సోమవారం మధ్యాహ్నానికి వీరి పాదయాత్ర ఏర్పేడుకు చేరుకుంది. మంగళవారం సాయంత్రం అలిపిరి చేరుకొని మెట్లమార్గంలో బుధవారం ఉదయానికి తిరుమల చేరుకుంటారు. 26 వ తేదీ స్వామివారిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకుంటారు. యార్లగడ్డ అభిమానులు కూచిపూడి కిషోర్, మాదల నానీబాబు, చిగురుపాటి సుమంత్, పరుచూరి నరేష్, చింతమనేని శ్రీకృష్ణ, నూకల సందీప్ లు పాదయాత్రలో పాల్గొన్నారు.



## క్రీడాకారులకు సాఫ్ట్ బాల్ కిట్‌లు అందుచేత

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అభ్యర్ధన మేరకు సాఫ్ట్ బాల్ క్రీడాకారులకు ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు సాఫ్ట్ బాల్ కిట్లను అందజేశారు. సోమవారం స్థానిక నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కొడాలి కిషోర్, కొడాలి నాగమల్లి జ్ఞాపకార్థం వారి సోదరుడు కొడాలి కోటేశ్వరరావు ( అట్లాంట–అమెరికా) సుమారు 20వేల రూపాయల వ్యయంతో సమకూర్చిన సాఫ్ట్ బాల్ కిట్లును కొల్లూరి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా కృష్ణాజిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గరికపాటి మారుతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సామర్ల సురేష్, దోవ శేషగిరిరావు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొనగా, మారుతి దాతలకు, సహకరించిన పెద్దలకు కృష్ణాజిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలిపారు.

## ఎన్నికల గోదాము పటిష్టత, భద్రతపై ప్రత్యేక దృష్టిపెట్టండి



రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్

**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జూన్ 23, మేజర్ న్యూస్ :** ఎన్నికల గోదాము భద్రత, పటిష్టతపై ప్రత్యేక దృష్టిపెట్టి, గోదాము నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ అన్నారు. ఎన్నికల గోదాము సాధారణ తనిఖీలో భాగంగా సోమవారం విజయవాడ రూరల్ గొల్లపూడి వ్యవసాయ మార్కెట్‌యార్డులోని ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరిచే గోదామును రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్.. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈవీఎం, వీవీప్యాట్ల భద్రతా ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాల ఏర్పాటును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో వివేక్ యాదవ్ సంతకం చేశారు. ఈ సందర్భంగా వివేక్ యాదవ్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న అన్ని జిల్లాల ఎన్నికల గోదాములను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను అందించడం జరుగుతోందన్నారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని వివేక్ యాదవ్ ఆదేశించారు. పరిశీలన ప్రక్రియలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, వై.రామయ్య (టీడీపీ), తరుణ్ కాకాని (బీజేపీ), కె.పరమేశ్వరరావు (ఏఏపీ), ఎ.నాగేంద్రప్రసాద్ (కాంగ్రెస్), కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ డిప్యూటీ తహసిల్దార్ గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ కేశినేనిని మర్యాదపూర్వకంగా కలిసిన కొండపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు



**విజయవాడ మేజర్ న్యూస్ :** కొండపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్ గా ఎన్నికైన చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ ఛైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, మరో వైస్ ఛైర్మన్ కదిమికొండ శ్రీ లక్ష్మీలతో పాటు కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా ఎంపీ కేశినేని శివనాథ్‌ను మంగళవారం ఎన్టీఆర్ భవన్ లో కలిశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ ఛైర్మన్లు చుట్టుకుదురు శ్రీనివాస్, కదిమికొండ శ్రీ లక్ష్మీ లను ఎంపీ కేశినేని శివనాథ్ శాలువాతో సత్కరించి అభినందించారు. అలాగే గొల్లపూడి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బసవ ఉమాను కూడా ఎంపీ కేశినేని శివనాథ్ శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. కొండపల్లి మున్సిపాలిటీ లో ఆగిపోయిన అభివృద్ధిని ప్రజలకు చెరువ చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, కౌన్సిలర్లు చనుమోలు నారాయణ, మైలా సైదులు, అమ్మాజీ, అడపా వెంకయ్య నాయుడు, కుమ్మరి శ్రీనివాసరావు లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా నివారణపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించండి : డాక్టర్ అఖిల



**పమిడిముక్కల జూన్ 23 మేజర్ న్యూస్ :** గ్రామాలలో మలేరియా నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని వీరంకిలాకులోని ప్రాథమి క ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అఖిల విజ్ఞప్తి చేశారు. మలేరియా నివారణ మాసోత్సవాలలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో మురుగునీరు నిలువ లేకుండా చూడాలని, ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాలలో క్లోరినేషన్ చేయించడంతోపాటు ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. దోమలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కాచి చల్లార్చిన నీటిని తాగటం వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ కృష్ణమోహన్, సిహెచ్ఓ లక్ష్మి, పీహెచ్ఎన్ ఝాన్సీరాణి, హెచ్ వి దేవకమలం, ఏఎన్ఎంలు నాంచారమ్మ, సుమలత, కృష్ణవేణి తదితరులతోపాటు పలువురు ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## సౌత్ జోన్ ఛాంపియన్ షిప్ హాకీ పోటీలకు ఎంపికైన పమిడిముక్కల హైస్కూల్ వి క్రీడాకారులు



**పమిడిముక్కల జూన్ 23 మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పమిడిముక్కలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈనెల 26వ తేదీ నుండి 30వ తేదీ వరకు బెంగళూరులో జరిగే సౌత్ జోన్ ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనేందుకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యలమంచిలి దుర్గాభవాని తెలిపారు. బెంగళూరులోని తుంకూర్ జిల్లా స్టేడియంలో జరిగే హాకీ పోటీలలో తమ పాఠశాల కు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నట్లు ఆమె చెప్పారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు బాలుర విభాగంలో ఎస్. కౌశిక్, సిహెచ్.రఘునాథ్, డి.రోహిత్ కుమార్, ఏ.జిగ్నేష్, వి.ఎన్.లోకేష్ బాబు, బాలికల విభాగంలో సిహెచ్.హేమ విజయ లక్ష్మి, టి.హిమబిందు, ఎ.ఆరాధ్య, జి.శ్రీ లక్ష్మీ ప్రియ, ఐ.శ్రీవల్లి, పి.దేవిశ్రీ, బి.సాయి మహాలక్ష్మి, డి.సాయిశ్రీ పోటీలో పాల్గొనేందుకు ఎంపికయ్యారన్నారు. పాఠశాల వ్యాయామ అధ్యాపకుడు ఇ.వి.నారాయణ శిక్షణలో వీరంతా ఉత్తమ ప్రదర్శన కనపరిచి ఈ పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ అధ్యాపకుడు నారాయణ, పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవాని, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రావూరి సుకన్య, పాఠశాల సిబ్బంది సోమవారం అభినందించారు.

## పామర్రులో జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు



**పామర్రు జూన్ 23 మేజర్ న్యూస్ :** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ 69వ వర్ధంతి వేడుకలను భారతీయ జనతా పార్టీ పామర్రు మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. దేశమంతా ఒక్కటే నినాదంతో కాంగ్రెస్ మంత్రివర్గంలో పనిచేస్తున్న ఆయన ఆ ప్రభుత్వ వైఖరి నచ్చక రాజీనామా చేసి జన సంఘ్ ను స్థాపించారు. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో జన సంఘ్ పార్టీ భారతీయ జనతా పార్టీగా రూపాంతరం చెందింది. అటువంటి మహనీయుని వర్ధంతి వేడుకలను జరుపుకోవడం తమ బాధ్యతగా మొవ్వ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య పేర్కొన్నారు. పామర్రు గ్రామ పంచాయతీలో జరిగిన ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ముదునూరు శివకృష్ణ, ఆ పార్టీ నాయకులు బడే కేశవరావు, యార్లగడ్డ రమేష్, ఉరిమి శ్రీకాంత్, సూరిబాబు, వీరాంజనేయులు, ప్రవీణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కళ్ళజోళ్ళ పంపిణీ



**వత్సవాయి, జూన్ 23, మేజర్ న్యూస్ :** మండలంలో గోపినేనిపాలెం గ్రామంలో గత వారంలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహణలో భాగంగా సోమవారం జయప్రద ఫౌండేషన్ చైర్మన్ దశరథ జనార్ధన్ చేతుల మీదగా 60 మందికి ఉచితంగా కళ్ళజోడులను అందించడం జరిగింది. ఈ సందర్బంగా దశరథ జనార్ధన్ మాట్లాడుతూ సర్వేంద్రియా నయనం ప్రధానం అంటూ ఫౌండేషన్ ద్వారా జగ్గయ్యపేట నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కంటి లోపములు ఉన్న వారందరికీ అవసరమైన వారికి ఉచితముగా కళ్ళజోడులు అందజేస్తానని, శుక్లములు ఉన్నవారికి ఆపరేషన్లు చేయిస్తామని తెలియజేస్తూ, ఇప్పటివరకు జగ్గయ్యపేట నియోజకవర్గంలో 10 గ్రామాలలో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 2000 మందికి పైబడి కంటి పరీక్షలు చేయగా, వారిలో 760 మందికి కళ్ళజోడులు ఇవ్వడం జరిగిందని, ఆపరేషన్ల సంబంధించి కంటిలోపములు గుర్తించిన వారికి(140 ) నూట నలభై మందికి ఆపరేషన్లు చేయించడం జరిగిందని, మిగిలిన వారికి కూడా శంకర నేత్రాలయం విజయవాడ హాస్పిటల్ వారి వద్ద ఉచితంగా ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని కంటిలోపములు ఉన్న ప్రజలందరూ వారి గ్రామాల్లో ఏర్పాటు చేసే ఉచిత కంటి శిబిరాలను వినియోగించుకోవాలని తెలిపారు. గోపినేనిపాలెంలో గత 7వ తేదీన కంటి ఆపరేషన్ కు సంబంధించి 53 మందికి త్వరలో శంకర నేత్రాలయం విజయవాడ వద్ద శుక్లముల ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి మండల పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, జగ్గయ్యపేట మండల పార్టీ అధ్యక్షులు ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు,పట్టణ పార్టీ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు కామినేని కిషోర్, గుంజుపల్లి వీరబాబు, పొన్నం పెంటయ్య, అలసకాని నవీన్, నేలవెల్లి కోటేశ్వరరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్షయ నిర్మూలనపై అవగాహన సదస్సు




**గన్నవరం, జూన్ 23, మేజర్ న్యూస్ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముస్తాబాద్ పరిధిలోని కేసరపల్లి 2లో వెంకట నరసింహపురం కాలనీలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా టిబి ముత్తు అభియాన్ కార్యక్రమం ఈ నెల రెండవ తారీకు నుండి 100 రోజులు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ టి సుజన వైద్యాధికారి ముస్తాబాద్ వారు తెలియజేసియున్నారు. టిబి దగ్గు మాత్రం లక్షణం కాదని, తెమడుతో కూడిన దగ్గు తెమడలో రక్తం పడటం, జ్వరం, అలసట, జాతిలో నొప్పి, గతంలో ఏమైనా ఆరోగ్య సమస్యలు రాత్రిపూట చమటలు, బరువు తగ్గటం, శారీరిక ఆరోగ్యంలో ఆకర్షణ మార్పు, ఏదైనా శరీర భాగంలో గుల్లలు లేక వాపు రావటం క్షయ వ్యాధి లక్షణాలని డాక్టర్ సుజనా తెలియచేసి ఉన్నారు. క్షయ వ్యాధిని దాచకూడదు అని క్షయ వ్యాధి సరైన సమయంలో మందులు వాడినట్లయితే వ్యాధి నయమవుతుందని డాక్టర్ సృజనా తెలిపి ఉన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు బలమైన ఆహార తీసుకొనుట కొరకు నెలకు 500 రూపాయలు ప్రభుత్వం వారు ఇచ్చుచున్నారని తెలియజేశారు. అనుమానితుల నుండి కళ్ళు పరీ క్షలు నిమిత్తం కపమును సేకరించారు. ఎవరైనా పై లక్షణములు కలిగి ఉన్న ఎడల మీ దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, లేక సామాజిక కేంద్రం వెళ్లి పరీక్షలు చేయించుకోవాల్సిందిగా డాక్టర్ సుజన తెలియజేసి ఉన్నారు. సోమవారం ఎఫ్ సి పి కార్యక్రమంలో భాగంగా వెంకట నరసింహ పురం కాలనీ వచ్చిన వివిధ అనారోగ్య సమస్యలతో వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ చేయడం జరిగింది వచ్చిన వారందరికీ కూడా అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముస్తాబాద్ వైద్యాధికారిని టి.సుజన, సిహెచ్ఓ జ్ఞాన శృతి, టిబి సూపర్వైజర్ సాంబశివరావు, సీతారామయ్య, రఘు, ఆశా వర్కర్లు పాల్గొనడం జరిగింది.

## అక్రమ ఇసుక తరలింపుపై తహసీల్దార్ కు సొసైటీ పెద్దలు ఫిర్యాదు



**ఘంటసాల, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని శ్రీకాకుళంలో ముదిరాజుల ఫీల్డ్ కోఆపరేటివ్ సొసైటీ ఆర్ఎస్ నెంబర్లలో గల 176(ఏ1), 176ఏ80 భూములలో గుంటూరు జిల్లా మంగళగిరి కి చెందిన అక్రమదారులు అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు ముదిరాజుల సొసైటీ పెద్దలు తహసిల్దార్ బి విజయప్రసాద్కు ఎస్సై ప్రతాపరెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఆర్ఎస్ నెంబర్ 1272 లంక భూమి కృష్ణా నది గర్భమున కలదు. 1950 సం"నకు పూర్వము చల్లపల్లి జమిందార్ మా ముదిరాజు సొసైటీ సభ్యులకు పండించుకోమని ఇవ్వగా వాటిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. 2024 సం" వచ్చిన వరదలకు ఈ భూములలో కొంత భాగం మట్టి, ఇసుక, బుసక మేటలు వేసి,యున్నది. గుంటూరు జిల్లా మంగళగిరి కి చెందిన కొందరు దొంగతనంగా పట్ట పగలే బాపట్ల జిల్లా, గాజుల్లంక లారీలలో మిషనరీతో సుమారు 9 ఎకరాలలో గల ఇసుక, మట్టి,బుసక మా లంక భూములలో దొంగతనంగా ఇసుకను తరలిస్తున్నారు, ఈ లంక భూమి లో తవ్వుతున్న మట్టి, ఇసుకను ఆపి, పరిశీలించి మాకు న్యాయం చేయాలని ముదిరాజ్ ఫీల్డ్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు వేడుకొన్నారు. ముందుగా తహశీల్దార్ కార్యాలయంలో, ప్రతాపరెడ్డి కూడా అర్జీ ఇవ్వటం జరిగింది..

## పవన్‌పై అనుచితమైన పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి: జనసేన



**నందిగామ, జూన్ 23, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖపట్నం సముద్ర తీరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా వేడుకలకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ,సీఎం చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత, ఆంధ్ర ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, తదితర కూటమి నేతలు పాల్గొన్నారు. అయితే కొందరు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ని టార్గెట్ చేస్తూ సోషల్ మీడియా ఖాతాలలో వైజాగ్‌లో యోగా చేస్తూ రిలాక్స్ అవుతున్న డిషిఎం అంటూ పవన్ కళ్యాణ్ స్థానంలో కుక్కని పెట్టి మార్ఫింగ్ చేసి అనుచితంగా, అవమానకరంగా సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన ‘ రాండమ్ ఫారెస్ట్ వి ఎస్పీ అనే ఎక్స్ ఖాతాపై నందిగామ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త తంబళ్ళపల్లి రమాదేవి ఆదేశాల మేరకు నందిగామ పోలీస్ స్టేషన్ లో జనసేన పార్టీ నాయకులు సీఐ వై వి యల్ నాయుడు ని కలిసి పిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో చందర్లపాడు మండల అధ్యక్షులు వడేల్లి సుధాకర్,జనసేన నాయకులు ఎర్రబడి సురేష్, కొమ్మవరపు స్వామి,లీగల్ సెల్ అడ్వకేట్ తాడేపల్లి కాంతారావు,మొగిలిచర్ల లక్ష్మి కాంత్,చలమల పురుషోత్తం,షైక్ సైదా,కొట్టె బద్రి,కొమ్మినేడి సత్యనారాయణ, ఐలపోగు నాగేంద్ర,మందా శ్యామ్ బాబు,కటరపు జయరాజు,జనసైనికులు తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఏపీయూడబ్ల్యూజే దౌర్జన్యాలను అరికట్టండి..



**ప్రెస్‌క్లబ్‌ను అందరిదిగా మార్చేందుకు సహకరించండి..**

**ప్రెస్‌క్లబ్ పేరు చెప్పి నిధులు దారిమళ్లిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి..**

**ప్రెస్‌క్లబ్‌లో జరుగుతున్న వ్యవహారాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టండి..**

**విజయవాడ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించిన జేఏసీ నేతలు..**



**విజయవాడ, మేజర్ న్యూస్ :** విజయవాడ ప్రెస్ క్లబ్ మాదే అంటూ ప్రెస్ క్లబ్ లోకి వచ్చే వేరే సంఘం జర్నలిస్టులను ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఇబ్బంది పెడుతున్న దృష్ట్యా ప్రెస్ క్లబ్ సాధన సమితి నాయకులు విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, విజయవాడ డిసిపి ఉదయ రాణి లకు పిర్యాదు చేశారు. విజయవాడ జర్నలిస్టుల సంక్షేమం కోసం అలనాటి సీనియర్ జర్నలిస్టు పెద్దల నేతృత్వంలో జులై 1971లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత కాసు బ్రహ్మానంద రెడ్డి "ప్రెస్ క్లబ్, విజయవాడ" కు శంకుస్థాపన చేశారని, అయితే "ప్రెస్ క్లబ్" మాదే అంటున్న ఏపీయూడబ్ల్యూజే హైదరాబాద్ లో ఏప్రిల్ 1975లో రిజిస్ట్రేషన్ అయినట్టుగా డాక్యుమెంట్స్ కనబడుతున్నాయనీ సిపి దృష్టికి తీసుకెళ్లారు. 1971లో శంకుస్థాపన జరిగిన ప్రెస్ క్లబ్ 1975లో రిజిస్టర్ అయిన ఏపీయూడబ్ల్యూజే కు ఎలా చెందుతుంది, అదేవిధంగా అలనాటి, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 1995లో ప్రెస్ క్లబ్ పేరు తోనే మొదటి అంతస్తును ప్రారంభించి ఉన్నారనీ, ప్రస్తుతం ప్రెస్ క్లబ్ లో ఉన్న 1971 శిలాఫలకంలో కానీ 1995 శిలాఫలములో కానీ ఎక్కడ కూడా ఏపీయూడబ్ల్యూజే అనుబంధమని ప్రస్తావన రాలేదన్నారు. ఇక ఏపీయూడబ్ల్యూజే చెబుతున్న ప్రెస్ క్లబ్ రిజిస్ట్రేషన్ బేలా 264 / 2018 లో ప్రెస్ క్లబ్ తమ అనుబంధం అంటూ రిజిస్ట్రేషన్ చేసుకున్నారనీ 1971లో శంకుస్థాపన జరిగిన ప్రెస్ క్లబ్ 2018 లో కొంతమంది కలిసి చేసుకున్న రిజిస్ట్రేషన్ ఎలా న్యాయ సమ్మతం అని సాధన సమితి నేతలు కమిషనర్ కు తెలిపారు.... ఈ విషయంలో గత రెండు సంవత్సరాల క్రితమే అప్పటి సబ్ కలెక్టర్ నివేదికను కలెక్టర్కి ఇచ్చి ఉన్నారన్నారు.. అయినా ఏపీయూడబ్ల్యూజే నాయకులు కూడా మీ దృష్టికి తీసుకువచ్చారు.. కాబట్టి మీరు కూడా దయచేసి నిజానిజాలు నిగ్గు తేల్చవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ప్రెస్ క్లబ్ ను తమ అదుపులో ఉంచుకున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు విజయవాడ జర్నలిస్టుల సంక్షేమాన్ని మరచి ప్రెస్ క్లబ్ డబ్బును దారి మళ్లించటమే కాక రాష్ట్ర ప్రభుత్వ వివిధ సంస్థలకు భారీగా బకాయి పడ్డారన్నారు.. అందులో భాగంగా ఇప్పటికే ఇరిగేషన్ శాఖ వారు కోటి 82 లక్షలకు పైగా కట్టాలని డిమాండ్ నోటీసిస్తూ ప్రెస్ క్లబ్ ను ఖాళీ చేయవలసిందిగా ఇరిగేషన్ శాఖ నోటిస్ ఇచ్చిందన్నారు. అదేవిధంగా ప్రెస్ క్లబ్ నిర్వాహకులుగా ఉన్న వారు వాటర్ టాక్స్ కట్టకపోతే మున్సిపల్ వారు డిస్ కనెక్ట్ చేశారని, అయితే దానిని అనధికారికంగా ఏపీయూడబ్ల్యూజే నేతలు తిరిగి నీటి చౌర్యానికి పాల్పడ్డారని నాలుగు లక్షల 50 వేలు పెనాల్టీని విధిస్తూ మున్సిపల్ వారు నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా "ప్రెస్ క్లబ్ సొంత బిల్డింగ్" కి మాత్రమే ప్రాపర్టీ టాక్స్ మినహాయింపు జీవో వర్తిస్తుండగా వారు యూనియన్ పేరు మీద జర్నలిస్టుల సంక్షేమ మరిచి ప్రెస్ క్లబ్ ఆదాయాన్ని వాడుతున్నారని ప్రెస్ క్లబ్ ఆదాయం దుర్వినియోగం అవుతుందనీ వారు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి వారీ ఆడిటే పెద్ద ఉదాహరణ గా పేర్కొన్నారు.. ప్రెస్ క్లబ్ కు 2018 రిజిస్ట్రేషన్ తప్ప దానికి కనీసం బ్యాంక్ ఎకౌంట్ కూడా లేకుండా ప్రెస్ క్లబ్ ఆదాయాన్ని యూనియన్ ఆదాయంగా చూపెట్టుకుంటున్నారన్నారు. ప్రభుత్వ నిధులకు, దాతల ఫండ్స్ కి "ప్రెస్ క్లబ్" అంటూ. జర్నలిస్టుల సంక్షేమం వచ్చేవరకు ఇది యూనియన్ సంబంధించినదని వారు చేస్తున్న వాదనపై విచారణ చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రెస్ క్లబ్ లోకి వారి ఇష్టం లేకపోతే జర్నలిస్టులు వస్తే వారిని దుర్భాషలాటమే కాక బయటకు నెట్టు వేసేన సంఘటనలు ఈ మధ్య జరిగాయనీ వారు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వీటి మీద కూడా విచారణ చేయవలసిందిగా కోరారు. విజయవాడలో దాదాపు 1500 పైగా అక్రిడేటెడ్ జర్నలిస్టులు, మరో 500 వరకు వివిధ కేడర్లలో జర్నలిస్టులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. అయితే ఇప్పుడు ఉన్న ప్రెస్ క్లబ్ కార్యవర్గం కేవలం 122 మందే సభ్యులను, అది కూడా యూనియన్ సభ్యులనే ప్రెస్ క్లబ్ సభ్యులుగా చూపించి కమిటీ ప్రకటించు కున్నారన్నారు. ఆ 122 మందిలో వర్కింగ్ జర్నలిస్టులు అతి తక్కువగా ఉన్నారనీ,. గుంటూరు, కర్నూల్ వారిని కూడా విజయవాడ ప్రెస్ క్లబ్ లో సభ్యులుగా చూపెట్టారనీ వారు తెలిపారు. అనేక ప్రముఖ పత్రికలకు, ఛానల్ కు, నిజంగా నడుస్తున్న ప్రాంతీయ పత్రికల మీడియా ప్రతినిధులకు మెంబర్ షిప్ లేదనీ,. వారి మెంబర్షిప్ లిస్ట్ మీద కూడా ఎంక్వయిరీ చేసి వర్కింగ్ జర్నలిస్టులో నిర్ధాయించవలసిందిగా కోరారు.దాని పైన మేము అధికారుల దృష్టికి గత మూడు సం. సంవత్సరాల నుంచి తీసుకు వెళ్తూన్నా మని..అందులో భాగంగా గౌరవ సబ్ కలెక్టర్ ఏపీయూడబ్ల్యూజే నాయకుల వద్ద ఏ రకమైన ఆధారాలు లేవు... ఇది అందరూ ప్రెస్ క్లబ్ గా మార్చడం కోసం తగు సూచనలు కలెక్టర్కి చేసి ఉన్నారన్నారు. కలెక్టర్ గత నెలలో విచారణకు పిలిస్తే ఏపీయూడబ్ల్యూజే నాయకులు హాజరు కాలేదనీ,.... తిరిగి ఈ నెలలోనే వాయిదా ఉన్నదనీ. ప్రెస్ క్లబ్ ను విజయవాడలో ఉన్న అక్రిడేటెడ్ జర్నలిస్టులందరికి ఉపయుక్తమయ్యే విధంగా, ఏపీయూడబ్ల్యూజే ఆక్రమణ చెర లో ఉన్న "విజయవాడ ప్రెస్ క్లబ్ విజయవాడ జర్నలిస్టులందరి ప్రెస్ క్లబ్ గా నిలబడే విధంగా" మీరు విచారణ చేసి తగు ఆదేశాలు ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామని ప్రెస్ క్లబ్ అందరిది సాధన సమితి నాయకులు సిపిని కోరారు...... సీపీని కలిసిన వారిలో విజయవాడ ప్రెస్ క్లబ్ అందరిదీ సాధన సమితి నాయకులు వీర్ల శ్రీరాం యాదవ్, మహోటివి గాంధీ, కె. ప్రసాద్ బాబు, ఎవివి శ్రీనివాసరావు, కె. నమ్మయ్య, చందన మధు, కాకుమాను వెంకట వేణు, మరీదు ప్రసాద్ బాబు, యామినేని వెంకటరమణ, అంతరాత్మ శ్రీనివాసరావు, తాళ్లూరి అనిల్, ఎన్ ఎస్ ఆర్, పసుపులేటి చైతన్య, ప్రశాంత్, మల్లిఖార్జునరావు, తాడికొండ బాలాజీ, దుర్గం ప్రతాప్, దార్ల ఉదయ్ కుమార్, సాయి, నరసింహారెడ్డి, నాగవరుణ్, బంగార్రాజా, చరణ్, వాసు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక భేష్

- ప్రణాళిక నవీకరణలో అధికార యంత్రాంగం కృషి ప్రశంసనీయం
- విపత్తు నిర్వహణ సవరణ చట్టం-2025పై అవగాహన ముఖ్యం
- చట్టంలో కొత్తగా పట్టణ విపత్తు నిర్వహణ అథారిటీ
- ముందస్తు హెచ్చరికల వ్యవస్థలో మైలురాయిగా సచేత్ యాప్
- విస్తృత ప్రజా భాగస్వామ్యంతోనే సమర్థ విపత్తు నిర్వహణ
- ప్రత్యేక సమావేశంలో ఎన్‌డీఎంఏ అధికారుల బృందం



**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జూన్ 23, మేజర్ న్యూస్ :** ఎన్‌టీఆర్ జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక అన్ని విధాలా బాగుందని.. ప్రణాళిక నవీకరణలో అధికార యంత్రాంగం కృషి ప్రశంసనీయమని జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎంఏ) సీనియర్ అధికారుల బృంద సభ్యులు పేర్కొన్నారు. ఎన్‌డీఎంఏ జాయింట్ అడ్వైజర్ ఎన్.ప్రకాష్, అండర్ సెక్రటరీ అభిషేక్ బిశ్వాస్, సీనియర్ కన్సల్టెంట్ అభినవ్ వాలియాలు సోమవారం జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్‌లో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక నవీకరణ, డిజాస్టర్ ఎమర్జన్సీ ఆపరేషన్ సెంటర్ కార్యకలాపాలు, విపత్తు ముప్పు తగ్గింపుతో పాటు భవిష్యత్తు విపత్తులను ఎదుర్కొనే వ్యవస్థ పటిష్టత తదితర అంశాలపై సమీక్షించి, సమన్వయ శాఖల అధికారులతో చర్చించారు. మాక్ డ్రిల్స్ నిర్వహణ, సామర్థ్య నిర్మాణంపై అధికారులకు శిక్షణ, సమన్వయం వంటి అంశాల్లో జిల్లాలో చర్యలు బాగున్నాయని, బుడమేరు వరదల సమయంలో బాధితులకు చేయూతనివ్వడం, పునర్నిర్మాణ చర్యల్లో అధికార యంత్రాంగం చూపిన చొరవను కూడా బృందం సభ్యులు ప్రశంసించారు. ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనే సరైన సన్నద్ధత విషయంలో ప్రతి శాఖా తమదైన ప్రత్యేక విపత్తు నిర్వహణ ప్రణాళికలను రూపొందించుకోవడం కీలకమన్నారు. విపత్తు నిర్వహణ (సవరణ) చట్టం - 2025పై అధికారులకు అవగాహన ఉండటం ముఖ్యమని, సెక్షన్ 41 ఏ (1) ప్రకారం కొత్తగా పట్టణ విపత్తు నిర్వహణ అథారిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. గౌరవ ప్రధానమంత్రి దార్శనికతకు అనుగుణంగా ప్రస్తుతమున్న టెలీ కమ్యూనికేషన్ టవర్లను ప్రజలను అప్రమత్తం చేసే వ్యవస్థ వంటి బహుళ ప్రయోజ నాలకు ఉపయోగించుకోవాల్సిన అవసరముం దన్నారు. ప్రకృతి వైపరీత్యాలపై రియల్‌టైమ్ హెచ్చరికల వ్యవస్థలో సచేత్ కీలక మైలురాయని, ఈ యాప్‌పై అధికారులతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విపత్తు నిర్వహణ ప్రణాళికలో ఏఐ, డ్రోన్ టెక్నాలజీ వంటి సాంకేతికతలను పొందుపరచడంపై ప్రత్యేక దష్టిపెట్టాలన్నారు. విస్తృత ప్రజా భాగస్వామ్యంతోనే విపత్తు నిర్వహణ మంచి ఫలితాలు ఇస్తుందని, ఆపద మిత్ర, ఇతర వాలంటీర్ సేవలకు ముఖ్యంగా యువతను ప్రోత్సహించాలని ఎన్‌డీఎంఏ అధికారుల బృంద సభ్యులు పేర్కొన్నారు.

కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ బుడమేరు వరదల సమయంలో గౌరవ ముఖ్యమంత్రి కలెక్టరేట్‌లోనే బస చేశారని.. బాధితులకు సహాయ మందించడంలో వినూత్న విధానాలను అనుసరించామని, వ్యవసాయ డ్రోన్లను ఆహారం పంపిణీకి ఉపయోగించామన్నారు. పారిశుద్ధ్య కార్యకలాపాల్లోనూ డ్రోన్లను ఉపయోగించినట్లు వివరించారు. బాధిత ప్రజల నుంచి సంతృప్తికర ఫీడ్ బ్యాక్ లభించిందన్నారు. సమన్వయ శాఖల భాగస్వామ్యంతో జిల్లాకు పటిష్ట విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందించామని, దీన్ని ఎన్‌డీఎంఏ మార్గదర్శకాలకు అనుగుణంగా, గత అనుభవాల ఆధారంగా ఎప్పటికప్పుడు ఆధునికీకరించడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం పాల్గొని.. విపత్తు నిర్వహణకు సంబంధించి నగరపాలక సంస్థ పరిధిలో తీసుకున్న చర్యలను వివరించారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.పోసిబాబు, జిల్లా అగ్నిమాపక అధికారి ఏవీ శంకరరావు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, డీపీవో పి.లావణ్య కుమారి, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, డీఏవో డీఎంఫ్ విజయకుమారి, పశు సంవర్థక అధికారి డా. ఎం.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999